క్లుప్తంగా

నేడు కార్యకర్తల సమావేశం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల స్థాయి నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కల్లూరు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని 22 పంచాయతీలకు సంబంధించిన నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి



ఈ–క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏఓ రమేష్

లింగాల : రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రతి పంటకు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారి రమేష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో జరుగుతున్న ఈ–క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రబీ–2023కి సంబంధించి పంట నమోదు ప్రారంభమైందని తెలిపారు. మండల, డివిజన్, జిల్లా, రాష్ట్ర అధికారులు పంట నమోదు ప్రక్రియ తనిఖీ చేస్తారని, ఏ విధమైన వ్యత్యాసాలు గమనించినా సంబంధిత సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ డేటా ఆధారంగానే పంటల బీమా, నష్టపరిహారం, సున్నా వడ్డీ, రుణాలు తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది హరిశిల్ప, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే అర్జీలు

ఎర్రగుంట్ల : నియోజకవర్గంలోని మండలాల నుంచి ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను ఆలస్యం లేకుండా పరిష్కరించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో స్పందనలో ప్రజా సమస్యలపై అర్జీలను ఆయన జిల్లా అధికారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలాల నుంచి ప్రజలు నేరుగా స్పందనలో అర్జీలు అందిస్తున్నారని, వాటి పరిష్కారాలు త్వరగా చేపట్టాలని కోరారు.

నీటి ప్రవాహాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గుండాలయ కోన, పంచ లింగాల కోన, నామాల గుండు తదితర శైవ క్షేత్రాల వద్ద ఉన్న నీటి ప్రవాహాల వద్ద భక్తులు జాగ్రత్తలు పాటించాలని పులివెందుల అర్బన్ సీఐ రాజు, ఆలయాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారని.. వంకలు, వాగులలోకి వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్తీక మాస మూడవ సోమవారం కావడంతో శైవ క్షేత్రాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఆయా శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైఎస్ మధురెడ్డికి సత్కారం

పులివెందుల : వైఎస్సార్‌సీపీ తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డిని నాయకులు సత్కరించారు. వైఎస్ మధురెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అంబకపల్లె రోడ్డులోని వైఎస్ మధురెడ్డి నివాసానికి చేరుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సదర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

అన్నదానం

వేంపల్లె : స్థానిక పాత గండి రోడ్డులోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌లో ఉన్న అనాథ వృద్ధులకు అన్నదాన నిర్వహించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కుమ్మరాంపల్లె మాజీ సర్పంచ్ రామాంజనేయరెడ్డి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పలు చోట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

'ఆడుదాం ఆంధ్ర' కిట్‌ల పంపిణీ

ముద్దనూరు : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా క్రీడా కిట్‌లను పంపిణీ చేశారు. సోమవారం మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఈవోఆర్డీ వీరభద్రుడు సచివాలయ సిబ్బందికి కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా తడి,పొడి చెత్తలను సేకరించడానికి ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేశారు.

ఈవీఎంలపై అవగాహన

జమ్మలమడుగు రూరల్ : ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం జమ్మలమడుగు మండల పరిధిలోని కన్నెలూరు, గొరిగెనూరు, ధర్మపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏఎస్ఓ సూర్యనారాయణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ఈవీఎంల ద్వారా తమకు నచ్చిన నాయకుడికి ఎలా వినియోగించుకోవాలో ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

శంభో శంకర.. హరోంహర

'శంభో శంకరా.. హర హర మహాదేవ' అంటూ భక్తులు ప్రణమిల్లారు. శివనామస్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీక మాస మూడో సోమవారాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీ పార్వతీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. తమను చల్లగా చూడాలని వేడుకున్నారు.

- భక్తులతో పోటెత్తిన శివాలయాలు
- ఘనంగా కార్తీక మాస పూజలు
- దీపాలు వెలిగించిన మహిళలు



పులివెందుల టౌన్ : ప్రత్యేక అలంకరణలో శ్రీమిట్టమల్లేశ్వరస్వామి



లింగాల : పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి



వేముల : శ్రీమోపూరి భైరవేశ్వరస్వామి

పులివెందుల టౌన్ : మండలంలోని మిట్టమల్లేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శివమనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. సాయంత్రం ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణ ఆధ్వర్యంలో మిట్టమల్లేశ్వరస్వామి కల్యాణం, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలోని నగరేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. బసవన్నకట్ట ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భీమలింగస్వామికి ప్రత్యేక అలంకారం చేసి ఉభయదారులచే ఆకుపూజలు జరిపించారు. వీరభద్రస్వామి ఆలయంలో అర్చకులు బసవరాజు, ఆలయ చైర్మన్ గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు.

ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ ప్రత్యేక పూజలు

కమలాపురం : మండలంలోని టి.చదిపిరాళ్లలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు రాత్రి ఆలయానికి చేరుకున్న వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా నిర్వాహకులు వారికి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైఎస్సార్ సీపీ నాయకులు పీవీ క్రిష్టారెడ్డి, చల్లా మునీంద్రారెడ్డి, జయ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

■ మండలంలోని కమలాపురం, టి.చదిపిరాళ్ల, గంగవరం, సంబటూరు, కోగటం, మీరాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, రామాపురం, దాదిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. టి.చదిపిరాళ్లలోని శ్రీ శివపార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అన్నదానం ఏర్పాటు చేశారు.

సంగమేశ్వరంలో..

వీరపునాయునిపల్లె : పాపాఘ్ని, మొగమూరు, పావని నదుల సంఘమంలో వెలసిన సంగమేశ్వరాలయం భక్తులతో పోటెత్తింది. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం గణపతి, సంగమేశ్వరుడు, పార్వతీదేవిలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి సౌకర్యాలు కల్పించారు. కొండూరు గ్రామానికి చెందిన గంగాధర్ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

■ మండలంలోని యు రాజుపాలెంలోని రామలింగేశ్వరస్వామి, యన్ పాలగిరిలోని భీమేశ్వరాలయం, కీర్తిపల్లెలోని నల్లనమ్మ ఆలయం, ఉరుటూరులోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలో..

సింహాద్రిపురం : మండల పరిధి భానుకోట సోమేశ్వరస్వామి క్షేత్రంలోని సోమేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవార్లను అర్చకులు బద్రి శర్మ, సురేష్ శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. కోనేరులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సిద్ధలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని పంచలింగాల కోన, గుండాలయ కోన, నామాలగుండు తదితర శైవ క్షేత్రాలలో భక్తులు బారులు తీరారు. నామాలగుండు సిద్ధలింగేశ్వరుడు, గుండాలయ కోన గుండాలేశ్వరుడు, పంచ లింగాలలో పంచ లింగాలను, మోట్నూతలపల్లె కోన గవేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల వద్ద చెక్క భజన బృందాలతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయంలో..

లింగాల : మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వర స్వామి ఆలయానికి వందలాది మంది భక్తులు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి ముక్కంటిని దర్శించుకున్నారు. అలాగే మండలంలోని లింగాల, బోనాల, వెలిదండ్ల, కర్ణపాపాయపల్లె, అంబకపల్లె, మురారిచింతల, ఇప్పట్ల, దొండ్లవాగు, అక్కులగారిపల్లె తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు అర్చనలు, అభిషేకాలు చేశారు.



జమ్మలమడుగు: కన్యతీర్థంలోని అన్నదానంలో భక్తులు

శ్రీ కాశీవిశ్వనాథ ఆలయంలో..

చెన్నూరు : శివాలపల్లె గ్రామ పరిధిలో వెలసిన శ్రీ కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో విజయ గ్రూప్ ఆఫ్ హోటల్స్ అధినేత ఇందిరెడ్డి మాధవరెడ్డి, వెంకటసుబ్బమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఖాసింఖాన్, తిమ్మారెడ్డితోపాటు మాధవరెడ్డి కుటుంబ సభ్యులు విచ్చేశారు. వారు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాయి మహేశ్వర్‌రెడ్డి, జ్యోతి, చంద్రారెడ్డి, తిమ్మారెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భైరవేశ్వరస్వామి ఆలయంలో..

వేముల : మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామ సమీపాన వెలసిన శ్రీమోపూరి భైరవేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. వేములలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భైరవేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి రామసిద్ధారెడ్డి ఏర్పాట్లు చేశారు.

బాలప్పకోనలో..

కొండాపురం : మండల పరిధిలోని శ్రీ బాలమల్లేశ్వరకోన(బాలప్పకోన), నీలమల్లేశ్వర కోనలో భక్తులు అభిషేకాలతోపాటు దీపారాధనలు చేశారు. వారికి అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కన్యతీర్థంలో..

జమ్మలమడుగు : మండల పరిధిలోని అతిపురాతనమైన కన్యతీర్థంలో బాల త్రిపుర సుందరి సుందరేశ్వరుల ఆలయాలకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఆలయం ధ్వజ స్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించి కోరికలు నెరవేర్చాలని వేడుకున్నారు. పట్టణంలోని సోమేశ్వర, పెన్నానది ఒడ్డున వెలసిన జంబులింగేశ్వర, కన్నెలూరులోని రామలింగేశ్వర స్వాముల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బొందలకుంట శివాలయంలో..

ముద్దనూరు : మండల పరిధి పలు గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు అభిషేక, రుద్రాభిషేక పూజలు చేశారు. బొందలకుంట పురాతన శివాలయం, యామవరం, ముద్దనూరు, వేల్పుచెర్ల, మంగపట్నం కోనలో భక్తుల సందడి నెలకొంది.

పొలతలకు తరలివచ్చిన భక్తజనం



పెండ్లిమర్రి : పొలతలలో శ్రీమల్లేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కమలాపురం: ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెండ్లిమర్రి : జిల్లాలో ప్రసిద్ధి పొందిన శైవక్షేత్రాలల్లో ఒక్కటైన పొలతల క్షేత్రానికి మూడవ కార్తీక సోమవారం భక్తులు జిల్లా నలుమూల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామివారికి గణపతి పూజ, ఆకుపూజ, మహామంగళహారతి, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు కొనేరుల్లో స్నానాలాచరించి తడి వస్త్రాలతో ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారి ఊరేగింపు అక్కదేవత గుడి వరకు వైభవంగా జరిగింది.

స్వామవారిని దర్శించుకొన్న ఎమ్మెల్యే దంపతులు, ఆర్టీసీ చైర్మన్

పొలతల క్షేత్రంలోని మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారిని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డి, అరుణమ్మ దంపతులు, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారిని ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు సాదరంగా ఆహ్వానించారు.

కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

మూడవ కార్తీక సోమవారం సందర్భంగా శ్రీమల్లేశ్వరస్వామి, పార్వతిదేవి అమ్మవారిల కల్యాణం ఉదయం 10 గంటల నుంచి 12 వరకు వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. ముందుగా కల్యాణానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుక వచ్చారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్నారు. కల్యాణాన్ని తిలకించడానికి జిల్లా నలుమూల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి కన్నులారా తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో..

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలను నిర్వహించారు. ఒక పక్క చిరు జల్లులు పడుతున్నప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే పెన్నానదిలో స్నానాలు ఆచరించి కొండపై గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి, సంతాన మల్లేశ్వర, సాక్షి మల్లేశ్వరస్వామి ఆలయాలలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు నదితోపాటు ఆలయ ధ్వజ స్తంభం వద్ద , ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించారు. కాయ కర్పూరాలను సమర్పించి పూజించారు. నదిలో దీపాలను వదిలారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పుష్పగిరి గ్రామంలోని వైద్యనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కామాక్షీ దేవి ఆలయంలో అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు చేశారు. త్రికుటేశ్వరస్వామి, ఉమామహేశ్వర స్వామి, భీమేశ్వర, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. చింతల పత్తూరులోని ఇంద్రనాథేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు.

■ వల్లూరులోని శ్రీ భవానీ శంకరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలను నిర్వహించారు. అమ్మవారికి, శ్రీ చక్రానికి కుంకుమార్చనలు చేశారు. పెద్దపుత్త, పెద్ద లేబాక, అంబవరం, పైడికాలువ తదితర గ్రామాలలోని శివాలయాలలో పంచామృతాభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు.



వల్లూరు : పుష్పగిరిలో పెన్నా నదిలో భక్తుల సందడి

10న సామాజిక సాధికార బస్సు యాత్ర



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : చెన్నూరు మండలం కొండపేట వంతెన వద్ద ఈ నెల 10వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగనన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అనేక పథకాల ద్వారా ఆదుకున్నారని, తద్వారా వారి జీవన శైలిలో మార్పులు వచ్చాయన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రతి అంశంలో బీసీలకు పెద్ద పీట వేశారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రతి రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంత్రి పదవులు మొదలు కొని స్థానిక సంస్థల పదవుల వరకు అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. తమ నియోజకవర్గంలో సైతం నాలుగు ఎంపీపీలు బీసీలకే కేటాయించామన్నారు. మిగిలిన రెండు చోట్ల వైస్ ఎంపీపీ పదవులిచ్చామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బీసీకే ఇచ్చామన్నారు. ఎస్సీలకు మున్సిపల్ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచు పదవులు ఇచ్చామన్నారు. అలాగే వారి అభివృద్ధి కోసం జగనన్న అనేక సంక్షేమ పథకాలు ఏర్పాటు చేశారన్నారు. 70–80 శాతం మైనార్టీలు మన వైపే ఉన్నారు. బీసీలు కూడా 65 శాతం ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారనడానికి జగనన్న పాలనే గీటురాయి అన్నారు. జగనన్న పాల్గొనకుండానే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు పాల్గొనే ఈ సామాజిక, సాధికార బస్సు యాత్ర ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు చెన్నూరు మండలం కొండపేట వంతెనపై జరుగుతుందని, ప్రతి గ్రామం నుంచి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, బాల గంగాధర్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, హిదాయత్, గఫార్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, జావీద్, షావలి, మోనార్క్, మస్తానయ్య, చెన్న కేశవరెడ్డి, గండి భాస్కర్, మోహన్ రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, దేవదానం ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణతో అరటిలో అధిక దిగుబడి

పులివెందుల రూరల్ : అరటిలో సిగటోకా తెగుళ్ల నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సుశీల పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లెలో రైతులతో కలిసి తెగుళ్ల సోకిన అరటి పంటను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరటిలో సిగటోకా తెగులు వ్యాపించిందని.. దీని నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధ్యమన్నారు. సిగటోకా, ఆకుమచ్చ తెగుళ్ల లక్షణాలు ఆకులపై మొదట అక్టోబర్ నెలలో నూతనంగా చిన్న, చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయని.. క్రమేపి అవి పెరిగి పెద్దవై బూడిద రంగులోకి మారుతాయన్నారు. దీని నివారణకు ట్రాఫికోలోజెల్ ఒక మి.మీ లీటరు నీటితోపాటు మినరల్ ఆయిల్ పది మి.లీ నీటిలో కలిపి ఆకులు మొత్తం తడిసేలా పిచికారి చేయాలన్నా. అలాగే రెండవ సారి కార్బండిజైన్‌తోపాటు మెన్కోజెల్ మిశ్రమంలో 1.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. ప్రతి పిచికారిలో స్టిక్కర్ గానీ సబ్బు పొడి గానీ కలపాలన్నారు. ఇలా చేయడం వల్ల సిగటోకా తెగులును నివారించవచ్చునన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో వెలసిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. రథంను పూలమాలతో అలంకరించి శ్రీ గణపతి స్వామి, శ్రీ సుబ్రమణ్యంస్వామి, శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను రథంలో ప్రతిష్టించారు. తర్వాత అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు స్వాముల వారికి కర్పూర హారతి అందించారు. పుర వీధుల మీదుగా గ్రామోత్సవానికి మహిళలు దీపాలు పట్టుకొని స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, కోలాటాలు, కేరళ వాయిద్యాలు, బాణసంచాల సంబరాలతో ఊరేగింపు జరిగింది.



ప్రత్యేక అలంకరణలో శ్రీ అయ్యప్పస్వామి

ప్రజల సంక్షేమం.. వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

- వలు ప్రాంతాల్లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం
- వైఎస్సార్‌సీపీ ఆవశ్యకతను వివరించిన ప్రజాప్రతినిధులు
- ప్రజల నుంచి విశేష స్పందన



కొండాపురం: వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎర్రగుంట్ల : వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి

పెండ్లిమర్రి : పులివెందుల క్లస్టర్ పరిధిలోని పులివెందుల, జమ్మలమడుగు, కమలాపురం నియోజకవర్గాల్లో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతలను ప్రజాప్రతినిధులు, నాయకులు వివరించారు. పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందని అన్నారు. అనంతరం సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ మస్తాన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మిరెడ్డి, క్రిష్టారెడ్డి, హుస్సేన్, విశ్వనాథ్‌రెడ్డి, గురివిరెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను ఆశీర్వదించండి

కొండాపురం : వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోసారి ఓటు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొండాపురంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండాపురంలో సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా రూ.20 కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు చింతా రాజారెడ్డి, కొండురామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఎంపీటీసీ సుకన్య చంద్రశేఖర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, పి. రామంజినేయుల్‌రెడ్డి, సాయి, చోటు పాల్గొన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే..

వీరపునాయునిపల్లె : ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే కావాలని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి అన్నారు. మండలంలోని ఇందుకూరు గ్రామ సచివాలయంలో జరిగిన ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అయ్యవారిపల్లె క్రాస్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పరిశీలకుడు రాజుపాలెం జగన్‌రెడ్డి, సర్పంచు వెంకటలక్షుమ్మ, ఎంపీటీసీ రంగజ్యోతి, స్థానిక నాయకులు విశ్వనాథరెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేష్, నంద కుమార్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండ

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్ సీపీ జెండా అండగా నిలుస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిడ్ అన్నారు. హనుమనుగుత్తి గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగుర వేశారు. సచివాలయ పరిధిలోని సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సుజనాదేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఎం.వీరభాస్కర్‌రెడ్డి, గ్రామ పార్టీ నాయకులు కె.నారపరెడ్డి, సీ పెద్ద సంజీవరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, రవీంద్రరెడ్డి, చెంచురెడ్డితోపాటు కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని మైలవరం మండల ఎంపీపీ చేరెడ్డి సావిత్రి అన్నారు. మైలవరం మండలం ఎం కంబాలదిన్నె గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురు చంద్ర ప్రభాకర్‌రెడ్డి ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుర్విరెడ్డి, సచివాలయాల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధగురుస్వామి ఆరాధన

పెండ్లిమర్రి : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ జగద్గురు సిద్ధగురుస్వామి ఆరాధన ఉత్సవాలు మూడవ కార్తీక సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, కుంకుమార్చన, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

ఆలయ ఆవరణలో నిర్వాహకులు బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి ప్రారంభించారు. ముందుగా వారు సిద్ధగురుస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం వికలాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేయడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వికలాంగులకు ఈ ట్రై సైకిల్స్ అందిస్తున్నామని ఆమె అందులో పేర్కొన్నారు. వికలాంగులు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటో వెంట తీసుకు రావాలని ఆమె తెలిపారు.